# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-10-2023** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **తెలంగాణా రాష్ట్రంలో జాతీయ పసుపు బోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు.**

**2.** **ఈ రోజు మహాత్మా గాంధీ, పూర్వ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా ఆ మహనీయులకు దేశ ప్రజలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.**

**3.** **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛత హి సేవా అభియాన్ కార్యక్రమం సంపూర్ణ విజయవంతమైంది.**

**4.** **తెలంగాణా రాష్ట్రంలో అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**

**5.** **ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్ 4వ స్థానంలో కొనసాగుతోంది.**

==========================

తెలంగాణా రాష్ట్రంలో జాతీయ పసుపు బోర్డు, సమ్మక్క, సారక్క పేరుతో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. తెలంగాణా రాష్ట్ర పర్యటనలో భాగంగా మహబూబ్ నగర్ పట్టణంలో నిన్న "ప్రజా గర్జన" పేరుతో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుతో రాష్ట్రంలోని పసుపు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ములుగు పట్టణంలో 9 వందల కోట్ల రూపాయల వ్యయంతో సమ్మక్క, సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా 13 వేల 5 వందల కోట్ల రూపాయల వ్యయం కాగల పలు అభివృద్ధి పనులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించి... శంకుస్థాపనలు చేశారు. ప్రధాన మంత్రి ప్రారంభించిన అభివృద్ధి పనులలో కాచిగూడ-రాయ్‌చూర్ మధ్య నడిచే నూతన రైలు... హసన్-చర్ల పల్లి హెచ్‌పిసిఎల్ ఎల్ పి జి పైపు లైను వున్నాయి. కాగా... వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కృష్ణపట్నం - హైదరాబాద్ మల్టీ లెవల్ ప్రాజెక్టు పైపు లైనును ప్రారంభించారు. 2 వేల 457 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సూర్యాపేట - ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణానికి కూడా ప్రధాన మంత్రి శంకుస్థాపన కూడా చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏమినెన్స్‌గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిని తీర్చిదిద్దుతామని పేర్కొంటూ ....

వాయిస్ - 42 సెకన్లు

---

తెలంగాణా రాష్ట్రానికి జాతీయ పసుపు బోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మహబూబ్‌నగర్‌లో నిన్న జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణా రాష్ట్ర చరిత్రలో ఇది మరచిపోలేని రోజని అన్నారు. సమ్మక్క–సారలమ్మను కోట్లాది మంది ప్రజలు పూజిస్తారని... వారి పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు కావడం ఎంతైనా హర్షణీయమని అన్నారు. పసుపు బోర్డు కోసం తెలంగాణా రాష్ట్ర పసుపు రైతులు ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నారని... ప్రధాన మంత్రి ప్రకటనతో దశాబ్దాల నాటి వారి కల సాకారం అవుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

సత్యాగ్రహం, అహింసా అనే పదునైన ఆయుధాలతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి... భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించి పెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. 1869వ సంవత్సరం గుజరాత్ రాష్ట్రంలోని పోరుబందర్ పట్టణంలో అక్టోబర్ 2వ తేదీన జన్మించిన మహాత్మాగాంధీ... ముందుండి శాంతియుతంగా భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపించి... యావత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచారు. అందుకే... మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2ను ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా కూడా నిర్వహిస్తున్నాయి. భారతదేశం చేసిన విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ 2007 సంవత్సరంలో గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీని “అంతర్జాతీయ అహింసా దినోత్సవం” గా పాటించాలని ప్రకటించింది. అప్పటి నుండి ప్రపంచ దేశాలు గాంధీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటిస్తున్నాయి.

మహాత్మాగాంధీ ప్రవచించిన సత్యం, అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికి నూతన మార్గం చూపాయని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గాంధీ జయంతి సందర్భంగా దేశ ప్రజలకు అందజేసిన శు భాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. అహింసా సిద్ధాంతం కోసం పోరాడడం మాత్రమే కాకుండా గాంధీ తన జీవితాంతం పరిశుభ్రత, మహిళా సాధికారిత, అస్పృశ్యత నివారణ, రైతుల హక్కుల సాధన కోసం కృషి చేశారని రాష్ట్రపతి అన్నారు. కాగా... మహాత్మాగాంధీ ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని... ఆయన అడుగు జాడల్లో నడుస్తామని ప్రజలు ప్రతిన పూనాలని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ పేర్కొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మరొక ప్రముఖులు, “ జై జవాన్, జై కిసాన్” నినాదాన్ని అందించి... భారతదేశానికి రెండవ ప్రధాన మంత్రిగా వ్యవహరించిన లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కూడా ఈ రోజు. ఈ సందర్భంగా దేశాభివృద్ధికి ఆయన అందించిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1904వ సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మొఘల్ సరాయ్ పట్టణంలో జన్మించిన ఆయన... స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీకి అత్యంత ప్రియశిష్యునిగా పేరు తెచ్చుకున్నారు. దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలకు గుర్తింపుగా 1966 వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆయనను భారత రత్న పురస్కారంతో సత్కరించింది.

---------------------------

భారత దేశాన్ని పరిశుభ్రంగా తీర్చి దిద్దేందుకు “ఒకటవ తేదీ, ఒక గంట, అందరం కలిసి” అన్న పేరుతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు నిచ్చిన స్వచ్ఛతా హి సేవా అభియాన్ కార్యక్రమం సంపూర్ణ విజయవంతమైంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు నిన్న జరిగిన ఈ పరిశుభ్రత కార్యక్రమంలో సమధికోత్సాహంతో పాల్గొన్నారు. మహాత్మాగాంధి జయంతి సందర్భంగా ఆ మహనీయునికి మనం ఇచ్చే నివాళిగా

ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రధాన మంత్రి కోరారు. ప్రధాన మంత్రి పిలుపునకు స్పందించి కేంద్ర మంత్రులు, అధికారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల మంత్రులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఈ పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని తమ ప్రాంతాల్లో చెత్తను ఏరివేసి పరిశుభ్రం చేశారు.

-----------------------------

తిరుపతిలోని రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్ ప్రెస్‌లో 14 నిమిషాల పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 14 నిమిషాల అద్భుతం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేభారత్ రైలులో చెత్తను శుభ్రం చేశారు. కేవలం 14 నిమిషాల్లోనే వందే భారత్ రైలును పరిశుభ్రంగా మార్చడంతో ప్రయాణికులే ఆశ్చర్యపోయారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బందిని ప్రయాణికులు అభినందించారు.

-----------------------------

తెలంగాణా రాష్ట్రంలో అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగుల పి.ఆర్.సి.ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి టి. హరీష్‌రావు తెలిపారు. హైదారాబాద్‌లో నిన్న జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అంగన్వాడీల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకులు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ... అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని హామీ ఇచ్చారు.

-----------------------------

ఆసియా క్రీడలలో భారతదేశం తన ప్రతిభ చాటుతోంది. వివిధ అంశాల్లో  నిన్న ఒక్క రోజే 15 పతకాలు సాధించడం విశేషం. ఆసియా క్రీడల్లో భారత్ గెలుచుకున్న మొత్తం పతకాల సంఖ్య 53కు చేరింది. పతకాల పట్టికలో భారత్ 4వ స్థానంలో ఉంది. వీటిలో 3 స్వర్ణ పతకాలు, 7 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు వున్నాయి. భారతదేశం గతంలో ఎన్నాడూ ఒక్క రోజులో ఇన్ని పతకాలు సాధించలేదు. 2010 ఆసియా క్రీడల్లో ఒకేరోజు భారత్ 11 పతకాలు, 2014 సంవత్సరంలో 10 పతకాలు, 2018 సంవత్సరంలో 9 పతకాలు సాధించింది. నిన్న తెలంగాణా రాష్ట్రానికి చెందిన బాక్సర్ నిఖత్ జరీన్ కాంస్య పతకం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యార్రాజి వంద మీటర్ల హర్డిల్స్  విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో నందిని కూడా రజత పతకం సాధించారు. షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సాత్విక్‌లతో కూడిన బ్యాడ్మింటన్ జట్టు టీమిండియా ఈవెంట్‌లో రజత పతకం గెలుచుకుంది.

-----------------------------

వాయువ్య బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం రాగల 24 గంటల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా పయనించే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రాగల మూడురోజుల పాటు తెలంగాణాలో వర్షాలు కొనసాగుతాయని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది.

=====================